ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



వార్త న్యూస్ యాప్ డౌన్లోడ్ చేసుకోండి DOWNLOAD
: fb.com/vaartha Digital




Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
06-11-2025,గురువారం


## టెక్స్‌టైల్ రంగంలో తొమ్మిది కంపెనీలు



- కంపెనీ ప్రతినిధులతో మంత్రి సవిత భేటీ
- నూతన టెక్స్‌టైల్ పాలసీకి పెట్టుబడిదారుల స్పందన
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త టెక్స్‌టైల్ పాలసీ
- ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి. సిసోడియా, కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

**విజయవాడ,నవంబర్06:** కంపెనీ ప్రతినిధులతో మంత్రిసవిత భేటీ ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో జౌళిరంగానికి మంచి అవకాశాలు కనిపిస్తున్నాయి.రాష్ట్ర చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించిన ప్రకారం, మొత్తం తొమ్మిది కంపెనీలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి.ఈ నెల 14,15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్‌షిప్ సదస్సు సందర్భంగా ఈ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనుందని ఆమె తెలిపారు. నిన్న రాష్ట్ర సచివాలయంలో తనఛాంబర్‌లో కంపెనీల ప్రతినిధులతో మంత్రిసవిత సమావేశమయ్యారు.కొందరు నేరుగా పాల్గొనగా, మరికొందరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.మ్యాట్రెస్ తయారీ,అపెరల్ ప్రొడక్షన్,గార్మెంట్స్ తయారీ,పాలిస్టర్ వేడింగ్ యూనిట్లు వంటి విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ఆసక్తి చూపాయి.ముఖ్యంగా ఈ సంస్థలు తమపరిశ్రమలను రాయలసీమప్రాంతంలో స్థాపించాలన్న ఉత్సాహం వ్యక్తం చేశాయని మంత్రి వెల్లడించారు.పరిశ్రమల స్థాపనకు అనుకూల ప్రాంతాలపై తుది నిర్ణయం విశాఖ సదస్సులో తీసుకోనున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త టెక్స్‌టైల్ పాలసీకి పారిశ్రామికవేత్తల నుంచి మంచి స్పందన వస్తోందని మంత్రి సవిత తెలిపారు. ఈ పాలసీ వల్లే అనేక సంస్థలు ఏపీలో పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని ఆమె వివరించారు.రాబోయే కాలంలో మరిన్ని కంపెనీలు రాష్ట్రంలో తమ యూనిట్లను స్థాపిస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.సమావేశానికి హాజరైన నలుగురు పెట్టుబడిదారులను మంత్రి సవిత సత్కరించారు.ఈకార్యక్రమంలో రాష్ట్రచేనేత,జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి. సిసోడియా,కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.



## నేడు ఏపీకి వర్ష సూచన

**విజయవాడ, నవంబర్06:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు మరోసారి మారుతున్నాయి.నైరుతి బంగాళాఖాతం నుంచి ఉత్తర కేరళ వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి.ఈ ద్రోణి ప్రభావం కారణంగా గురువారం రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వర్షాల సమయంలో చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో కృష్ణా,ప్రకాశం,నెల్లూరు,అనంతపురం, శ్రీసత్యసాయి,కడప, అన్నమయ్య,చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడే అవకాశముందని అధికారులు హెచ్చరించారు.మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.నిన్న సాయంత్రం వరకు ప్రకాశం జిల్లా బి.చెర్లపల్లిలో 65.2 మి.మీ.,శ్రీసత్యసాయి జిల్లా గండ్లపెంటలో 45 మి.మీ.నెల్లూరు జిల్లా రాపూర్‌లో 40.5 మి.మీ.విజయవాడ తూర్పు ప్రాంతంలో 39 మి.మీ.వర్షపాతం నమోదైనట్లు విపత్తుల శాఖ వివరించింది.ప్రభుత్వం చర్యలు-రైతుల సహాయానికి సిద్ధం రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాలను తక్షణమే అంచనా వేసి రైతుల ఖాతాల్లో నేరుగా పరిహారం జమ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది.అధికారుల పర్యవేక్షణలో రైతుల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని మంత్రి తెలిపారు.అదే విధంగా,తుఫాన్ కారణంగా పంట నష్టాలను తగ్గించే దిశగా భవిష్యత్‌లో బలమైన వ్యవసాయ మౌలిక సదుపాయాలు,నీటి పారుదల ప్రాజెక్టులు,విత్తన భద్రతా పథకాలు అమలు చేయాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది.

## తెలంగాణ సర్కారు బడుల్లో కంప్యూటర్ టీచర్లు..



**హైదరాబాద్, నవంబర్06:** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వపాఠశాలల్లో డిజిటల్ విద్యను బలోపేతం చేయడానికి కీలక నిర్ణయం తీసుకుంది.దాదాపు రెండు దశాబ్దాల తర్వాత,కంప్యూటర్ టీచర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.ఈచర్యతో విద్యార్థులకు సాంకేతిక విద్యను మరింత చేరువ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.రాష్ట్రవ్యాప్తంగా 5 లేదా అంతకంటే ఎక్కువ కంప్యూటర్లు ఉన్న 2,837 పాఠశాలలను అధికారులు గుర్తించారు.ఈ పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు.తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా నియామక ప్రక్రియ త్వరలోప్రారంభం కానుంది.ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు రూ.15,000 గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఈఖర్చును సమగ్రశిక్షా నిధుల ద్వారా భరించనున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో సుమారు 20 ఏళ్ల క్రితం 4,200 పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.ఐదేళ్లపాటుఇన్‌స్ట్రక్టర్లను నియమించినప్పటికీ,ఆతర్వాత వారిని తొలగించడంతో ల్యాబ్‌లు నిరుపయోగంగామారాయి.సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనేక కంప్యూటర్లు పాడై మూలకుచేరాయి.ఇప్పుడు మళ్లీ నియామకాలుచేపట్టడం ద్వారా ల్యాబ్‌లను తిరిగి ప్రారంభించి,విద్యార్థులకు డిజిటల్ విద్యనుఅందించడంలో బోధకులు కీలక పాత్ర పోషించనున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే అమలవుతున్న పలు డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ విజయవంతానికి ఈ కొత్త నియామకాలు దోహదం చేయనున్నాయి. ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సహకారంతో 1,354 >>2

## కరెంట్ బిల్లులు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం: మంత్రి గొట్టిపాటి

**విజయవాడ, నవంబర్06:** రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులందరికీ ప్రభుత్వం పెద్ద శుభవార్త చెప్పింది.ఈ నెల నుంచే కరెంట్ బిల్లులు తగ్గేలా చర్యలు తీసుకున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు.గతప్రభుత్వ హయాంలో విధించిన అధిక ఛార్జీల భారాన్ని తొలగిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.అనకాపల్లి జిల్లామాడుగుల నియోజక వర్గంలోని చౌడువాడ, కింతలి గ్రామాల్లో బుధవారం నూతనంగా నిర్మించిన విద్యుత్‌ఉపకేంద్రాలను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గత ప్రభుత్వం ఎఫ్‌పీపీ (ఇంధన,విద్యుత్ కొనుగోలు సర్దుబాటు)ఛార్జీల రూపంలో యూనిట్‌కు 40పైసలు అధికంగావసూలు చేసిపేద,మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు.ప్రస్తుతం ఆ ఛార్జీని 13 పైసలకు తగ్గిస్తున్నామని,దీనివల్ల వినియోగదారులకు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్‌మౌలిక సదుపాయాలను బలో పేతంచేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా 11 జిల్లాల్లో రూ.250 కోట్ల



వ్యయంతో 69 కొత్త విద్యుత్ ఉపకేంద్రాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.దీంతో పాటు,రాష్ట్రంలోని 20వేల ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారుల ఇళ్లపై ఉచితంగా సౌరవిద్యుత్తు యూనిట్లనుఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇటీవల విద్యుదాఘాతానికి గురై మరణించిన ఇద్దరి కుటుంబ సభ్యులకు మంత్రి గొట్టిపాటి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారికి ప్రభుత్వం తరఫున రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు.

## రూ.18కే గోధుమ పిండి..గుడ్ న్యూస్ తెలిపిన మంత్రి నాదెండ్ల

**విజయవాడ, నవంబర్06:** ప్రభుత్వంచర్యలు-రైతుల సహాయానికి సిద్ధం రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాలను తక్షణమే అంచనా వేసి రైతులఖాతాల్లో నేరుగా పరిహారం జమ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది.అధికారుల పర్యవేక్షణలో రైతుల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని మంత్రితెలిపారు.అదే విధంగా,తుఫాన్ కారణంగా పంట నష్టాలను తగ్గించే దిశగా భవిష్యత్‌లో బలమైన వ్యవసాయ మౌలిక సదుపాయాలు,నీటి పారుదల ప్రాజెక్టులు,విత్తన భద్రతా పథకాలు అమలు చేయాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది. మంత్రినాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ,నవంబర్ నెలలో వర్ష సూచనలు ఉన్ననేపథ్యంలో రైతుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామనివెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులకు ఉచితంగా 50 వేల టార్పాలిన్ షీట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంటలు వర్షాల వల్ల నష్టపోకుండా ఉండటానికి ఈ టార్పాలిన్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.రైతు ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యమని,ఎటువంటి సహజ విపత్తు వచ్చినా వారికి రక్షణకల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ చర్యలతో పంటలను రక్షించడమే కాకుండా,రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తోంది.అలాగే ధాన్యం అమ్మిన రైతులకు అదే రోజు డబ్బు ఖాతాల్లో జమయ్యేలా కొత్త సాంకేతిక విధానాలు అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. బ్యాంకు సెలవులు ఉన్న సందర్భంలో మాత్రం డబ్బు తర్వాత రోజు జమ అవుతుందని తెలిపారు.



## బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల..



**న్యూఢిల్లీ, నవంబర్ 06:** దేశీయ మార్కెట్‌లో బంగారం,వెండి ధరలు గురువారం స్వల్పంగా పెరిగాయి.దేశంలోని ప్రధాననగరాల్లో బంగారం ధరలు మళ్లీ హైర్‌బాయింగ్ కారణంగా పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు.ముంబైలో 24 క్యారెట్ బంగారంధర 10గ్రాములకు1,21,470, 22 క్యారెట్ బంగారం ధర 1,11,340 గా నమోదైంది.ఈ ధరల్లో మేకింగ్ ఛార్జీలు కలుపబడలేదు.వెండి ధర కిలోకి 1,50,400 గా ఉంది.ఫ్యూచర్స్ మార్కెట్ పరిస్థితి :లో డిసెంబర్ కాంట్రాక్ట్‌లో బంగారం 0.12 ఎగసి 1,20,666 /10 వద్ద ట్రేడ్ అయింది.వెండి కూడా 0.04 స్వల్ప పెరుగుదలతో 1,47,378 వద్ద ట్రేడవుతోంది.ఈరోజు ప్రధాన నగరాల్లో బంగారం ధరలు మీహతా ఈక్విటీస్ కమోడిఫిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి ప్రకారం:అమెరికాలో రాజకీయ అనిశ్చితి పెరగడంతో సేఫ్‌హావెన్ బాయింగ్‌పెరిగింది.చైనా ఆస్ట్రేలియా నుంచి ఫిజికల్ గోల్డ్ డిమాండ్ బలంగా కొనసాగుతోంది. అయితే డాలర్ సూచీ 3 నెలల గరిష్టానికి చేరుకోవడం వల్ల బంగారం పెరుగుదలకు కొంత అడ్డుపడింది.భారతదేశంలో బంగారం ధరలను ప్రభావితం చేసే అంశాలు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు రూడాలర్ మార్పిడి విలువ దిగుమతి సుంకాలు పన్నులు వివాహాలు,పండుగల సమయంలో డిమాండ్.

## వరద నష్ట రైతులకి 6 రూపాయల పరిహారం



**ముంబై, నవంబర్06:** మహారాష్ట్రలో వరదలు,భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం పేరుతో ప్రభుత్వం చెల్లిస్తున్న మొత్తాన్ని చూసి అందరూ షాక్‌కు గురవుతున్నారు. ఛత్రపతి శంభాజీనగర్ జిల్లా పైఠాన్ తాలూకాలోని దావర్‌వాడి గ్రామానికి చెందిన రైతు దిగంబర్ సుధాకర్ తాంగ్డేకు ప్రభుత్వం ఇచ్చిన పరిహారం కేవలం రూ.6 మాత్రమే కావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.గత ఆగస్టుసెప్టెంబర్ నెలల్లో మరాఠ్వాడా ప్రాంతంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు,వరదల కారణంగా రైతులు తీవ్ర పంట నష్టాన్ని చవిచూశారు.దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఏకంగా రూ.31,628 కోట్ల పరిహార ప్యాకేజీని ప్రకటించింది.ఇందులో పంట నష్టంతో పాటు నేల కోత,ఇళ్లు,పశువుల పాకలు దెబ్బతినడం వంటి నష్టాలకు కూడా పరిహారం ఉంది.అయితే రైతులకు అందిన మొత్తం ఈ ప్రకటనలకు పూర్తి విరుద్ధంగా ఉంది.శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మరాఠ్వాడా పర్యటనలో భాగంగా పైఠాన్ తాలూకాలోని నందార్ గ్రామంలో రైతులతో సంభాషించిన సందర్భంగా తాంగ్డే ఈ విషయాన్ని వెల్లడించారు.నాకు కేవలం రెండు ఎకరాల భూమి ఉంది. నా బ్యాంకు ఖాతాలో రూ.6 జమ అయినట్లు నాకు మెసేజ్ వచ్చింది.ఇంత తక్కువ చెల్లించడానికి ప్రభుత్వానికి సిగ్గుండాలి.ఈ మొత్తం నాకు ఒక కప్పు టీ కొనడానికి కూడా సరిపోదు. ప్రభుత్వం రైతులను పెద్ద జోక్ చేస్తోంది" అని తాంగ్డే ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో ఇప్పటికే అప్పుల ఊబిలో చిక్కుకున్న తమకు రుణమాఫీ అవసరమని.ఇలాంటి చిన్న మొత్తాలు పంపి ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో ఉద్ధవ్ ఠాక్రే రుణమాఫీ చేశారని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం కూడా హామీ ఇచ్చి ఏమీ చేయలేదని విమర్శించారు.ఇలాంటి పరిహాసాస్పద పరిహారం తాంగ్డేకు ఒక్కరికే ఎదురు కాలేదు.గతంలో అకోలా జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంట నష్టానికి పరిహారంగా కేవలం రూ.2.30,రూ.21 మాత్రమే అందుకున్నారు.ఈ మొత్తాన్ని రైతులు తమ దుస్థితికి అవమానంగా,ఎగతాళిగా >>2

## భక్తులకు గుడ్ న్యూస్.. 2 గంటల్లోనే శ్రీవారి దర్శనం!

**తిరుమల, నవంబర్06:** తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ మరో శుభవార్త చెప్పింది. అత్యాధునిక ఏఐ సాంకేతికతను ఉపయోగించి భక్తులు కేవలం రెండు గంటల్లోనే స్వామివారి దర్శనం పూర్తి చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈ విధానం కోసం పైలట్ ప్రాజెక్టు ఇప్పటికే విజయవంతమైందని,త్వరలోనే అన్ని భక్తులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా దళిత వాడల్లో 5,000కు పైగా శ్రీ వెంకటేశ్వర ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన మేరకు దేశంలోని అన్ని రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.ఇక తిరుపతిలోని ఫ్లైఓవర్‌కు మునుపటి "శ్రీనివాస సేతు" అనే పేరును మార్చి తిరిగి "గరుడ వారధి"గా నిర్ణయించినట్లు నాయుడు తెలిపారు. అదనంగా, తిరుపతి విమానాశ్రయానికి శ్రీ వేంకటేశ్వర ఎయిర్‌పోర్టు"గా నామకరణం చేయడానికి ఫైలు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం కోసం పంపినట్లు చెప్పారు.విశాఖ శారదా పీఠానికి కేటాయించిన భూముల లీజులు రద్దు చేశామని, తిరుమల కింద 50 ఎకరాల్లో 25,000 మంది భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించే ప్రణాళిక ఉందని తెలిపారు.ఏడాది కాలంలో టీటీడీకి సుమారు రూ.1,000 కోట్ల విరాళాలు అందాయని,దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాల్లో నిత్యాన్నదానం కార్యక్రమం అమలు చేయనున్నట్లు ప్రకటించారు.



## దుబాయ్‌లో జాక్‌పాట్ కొట్టిన భారతీయుడు




**దుబాయ్, నవంబర్06:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నివసిస్తున్న ఓ భారతీయుడికి అదృష్టం కలిసివచ్చింది. దుబాయ్‌లో నిర్వహించిన ప్రముఖ బిగ్ టికెట్ ఈడ్రాలో ఆయన పావు కిలో (250 గ్రాములు) బంగారం గెలుచుకున్నారు.దీంతో కేరళకు చెందిన ప్రవాస భారతీయుడు నితిన్ కున్నత్ రాజ్ ఆనందంలో మునిగిపోయారు.2016 నుండి దుబాయ్‌లో ఉద్యోగం చేస్తూ ఉన్న నితిన్,ఇటీవల తన 10 మంది స్నేహితులతో కలిసి టికెట్‌ను కొనుగోలు చేశారు.అదృష్టం కలిసి రావడంతో,టికెట్ నంబర్ 351853 బిగ్ టికెట్ ఈడ్రాలో విజేతగా నిలిచింది.డ్రా నిర్వాహకులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా,మొదట ఆయన నమ్మలేకపోయారు.అయితే పూర్తి వివరాలు చెబుతూనే ఆయనకు నిజమని అర్థమైంది.నితిన్ ఈ డ్రాలో 24 క్యారెట్ల స్వచ్ఛత గల 250 గ్రాముల బంగారం గెలుచుకున్నారు.భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ.30 లక్షల వరకు ఉంటుంది.ఈ బహుమతిని తాను స్నేహితులందరితో పంచుకుంటానని నితిన్ తెలిపారు.నా జీవితంలో ఇలాంటి అదృష్టం వరించడం ఇదే మొదటిసారి" అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.భారతీయుల అదృష్టం కొనసాగుతోంది ఇటీవలి కాలంలో భారతీయులు బిగ్ టికెట్ డ్రాల్లో తరచుగా విజేతలుగా నిలుస్తున్నారు. తాజాగా జరిగిన సిరీస్ 280 డ్రాలో మరో భారతీయుడు శరవణన్ వెంకటాచలం 25 మిలియన్ దిర్హామ్‌లు (సుమారు రూ.60.42 కోట్లు) గెలుచుకున్నారు.దీంతో గల్ఫ్ ప్రాంతంలో భారతీయుల అదృష్ట గాథలు మళ్లీ చర్చకు వచ్చాయి.

## తెలంగాణ సర్కారు బడుల్లో కంప్యూటర్ టీచర్లు..

>> పాఠశాలల్లో అమలు చేస్తున్న అసిస్టెడ్ లాంగ్వేజ్ అండ్ మ్యాథ్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్,అలాగే తాజాగా ప్రారంభించిన ఖాన్ అకాడమీ ఆన్‌లైన్ క్లాసులు సమర్థవంతంగా నడవాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న బోధకులు అవసరం ఉంది.ఈ నియామకాలతో తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌లు తిరిగి చురుకుగా మారి,డిజిటల్ విద్యాబోధనకు కొత్త దిశ లభిస్తుందని విద్యాశాఖ అధికారులునమ్ముతున్నారు.రాష్ట్రంలోనివిద్యార్థులు సాంకేతిక విద్యలో ముందంజలో ఉండేలా ఈ నిర్ణయం సహాయపడనుందని భావిస్తున్నారు.

## వరద నష్ట రైతులకి 6 రూపాయల పరిహారం


>> పేర్కొన్నారు.నెలల తరబడి ఎదురుచూసిన తర్వాతఈక్రమంలోనే రైతులు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి.అందిన చిన్న మొత్తాలను చెక్కుల రూపంలో వెనక్కి ఇచ్చేశారు. నెలల తరబడి ఎదురుచూసిన తర్వాత.రైతన్నలకు అందిన ఈ హాస్యాస్పద పరిహారం ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న లోపాలను,పారదర్శకత లేమిని ఎత్తి చూపుతోంది.తక్షణమే పరిహార ప్రక్రియను సమీక్షించి.రైతులకు సరైన న్యాయం చేయాలని ప్రతిపక్షాలు,రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కాలుష్యం, వేడితో మగాళ్లలో పెను ముప్పు..



**న్యూఢిల్లీ,నవంబర్ 05:**డాక్టర్ నీతి కౌశిష్: కాలుష్యం,వేడి వల్ల మగవారికి పెరుగుతున్న ముప్పు–నిపుణుల హెచ్చరిక ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు,కాలుష్యం పెరుగుతుండటంతో మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.తాజాగా నిపుణులు హెచ్చరిస్తున్న అంశం పురుషుల సంతానోత్పత్తి సామర్థం తగ్గిపోవడం.ఫరీదాబాద్‌లోని ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హాస్పిటల్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ నీతి కౌశిష్ మాట్లాడుతూ,పురుషుల్లో సంతానోత్పత్తి సామర్థం తగ్గిపోవడం కేవలం వ్యక్తిగత సమస్య కాదు,ఇది పర్యావరణ ఆరోగ్యానికి సంకేతం" అని పేర్కొన్నారు.ధూళికణాలు,విష వాయువులు వీర్య కణాల నాణ్యతను దెబ్బతీస్తున్నాయి.ఇవి శరీరంలోకి చేరిన తర్వాత ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరగడం వల్ల డీఎన్ఏ నష్టానికి దారితీస్తుంది.ఇది హార్మోన్ల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపి సంతానోత్పత్తి సామర్థ్యాన్ని తగ్గిస్తుంది.2022లో ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ పర్స్పెక్టివ్స్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం,అధిక కాలుష్య ప్రాంతాల్లో నివసించే పురుషుల్లో వీర్య కణాల చలనం గణనీయంగా తగ్గినట్లు తేలింది.అధిక ఉష్ణోగ్రతలు కూడా మరో కీలక కారణమని నిపుణులు అంటున్నారు.వృషణాలు సాధారణంగా శరీర ఉష్ణోగ్రత కంటే కొంచెం తక్కువ ఉష్ణోగ్రత వద్దనే సరిగ్గా పనిచేస్తాయి.కానీ వేడి వాతావరణంలో పనిచేయడం,బిగుతైన దుస్తులు ధరించడం,వడగాలుల ప్రభావం వంటి కారణాలు వీర్య కణాల ఉత్పత్తిని దెబ్బతీస్తాయి.జర్నల్ ఆఫ్ థర్మల్ బయాలజీలోని అధ్యయనాల ప్రకారం, వృషణాల ఉష్ణోగ్రత 1 ది పెరిగినా వీర్య కణాల ఉత్పత్తి 40 వరకు తగ్గుతుంది.డాక్టర్ కౌశిష్ చెబుతున్నట్లు, కాలుష్యం,వేడి రెండూ కలిసి డబుల్ అటాక్ లా పని చేస్తున్నాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నిర్వహించిన తాజా అధ్యయనంలో,కాలుష్య ప్రాంతాల్లో నివసించే పురుషుల వీర్య కణాల డీఎన్ఏ దెబ్బతినడం,హార్మోన్ల అసమతుల్యత ఎక్కువగా ఉన్నట్లు తేలింది.తీసుకోవాల్సిన జాగ్రత్తలు:వేడి వాతావరణంలో ఎక్కువ సేపు ఉండకూడదు.వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.శరీరానికి తగినంత నీరు అందించాలి.ధూమపానం,మద్యపానం దూరంగా ఉంచాలి.పండ్లు,కూరగాయలు,నట్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉన్న ఆహారం తీసుకోవాలి.పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం,నగరాల్లో వేడి నియంత్రణ చర్యలు చేపట్టడం,ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.సంతానోత్పత్తి ఆరోగ్యం అనేది కేవలం వైద్య అంశం మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణతో కూడుకున్న అంశమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## కూతుర్ల మీద ప్రేమ .. కట్ చేస్తే రూ. 14 కోట్లు పోగొట్టుకున్న తండ్రి



**పూణే,నవంబర్06:**తన కుమార్తెల అనారోగ్యాన్ని నయం చేయాలన్న ఆత్రంలో ఒక ఐటీ ఇంజనీర్ కుటుంబం జీవితకాల సంపాదన మొత్తాన్ని కోల్పోయింది. మహారాష్ట్రలోని పూణేలో చోటుచేసుకున్న ఈ మోసం కేసు టెక్కీ వర్గాల్లో సంచలనం రేపింది. ఆధ్యాత్మిక వైద్యం పేరుతో నమ్మకాన్ని దోచుకున్న నిందితురాలిపై పోలీసులు కేసు నమోదు చేశారు.డీసీపీ వివేక్ మసల్ తెలిపిన వివరాల ప్రకారం,బాధిత దంపతులు 2018లో ఒక ఆధ్యాత్మిక మహిళను కలిశారు.ఆమె తరచూ దైవ శక్తుల ద్వారా రోగాలను నయం చేయగలమని" చెప్పి విశ్వాసాన్ని పొందింది.బాధితుడు లండన్‌లో పని చేసి 2010లో పూణేకు తిరిగి వచ్చిన టెక్కీ. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా,ఒకరు వికలాంగురాలు, మరొకరు తీవ్రమైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు.ఈ నేపథ్యంలో,ఆధ్యాత్మిక మహిళ ఇచ్చిన మాటలపై విశ్వాసం ఉంచి ఆమె వద్దకు వెళ్లారు.మీ ఇళ్లపై దోషం ఉంది, దానిని తొలగించాలంటే మీ ఆస్తులను అమ్మి ఆ డబ్బును పూజా కార్యక్రమాలకు వినియోగించాలి" అని ఆ మహిళ నమ్మబలికింది.ఆమె ఆధ్వర్యంలో పూజలు, యజ్ఞాలు చేస్తే పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పి వారిని పూర్తిగా తన నియంత్రణలోకి తెచ్చుకుంది. దాంతో బాధితుడు లండన్‌లోని ఇల్లు, పూణేలోని ఫ్లాట్,కొంకణ్‌లో ఉన్న భూమి అన్నీ అమ్మేశాడు. అంతేకాకుండా ప్రావిడెంట్ ఫండ్, బంధువుల వద్ద తీసుకున్న అప్పులు కూడా ఆమె ఖాతాలకు బదిలీ చేశాడు. 2018 నుంచి 2024 మధ్యకాలంలో మొత్తం రూ.14 కోట్లు ఆ నిందితురాలి ఖాతాలకు చేరాయి. పూజల తర్వాత కూడా పిల్లల ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో దంపతులు ఆ మహిళ మోసం చేశారని గ్రహించారు. తాము సంపాదించిన ప్రతి రూపాయి పోయిందని తెలుసుకుని తీవ్ర నిరాశకు గురయ్యారు.చివరికి న్యాయ సలహా తీసుకుని నవంబర్3,2025న పూణే పోలీసులకుఫిర్యాదు చేశారు.డీసీపీ వివేక్ మసల్ మాట్లాడుతూ,ఫిర్యాదులో పేర్కొన్న అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం.నిందితురాలి ఖాతాలు,డబ్బు వాదేవీలమార్గాలు,సహచరుల పాత్రలను ట్రేస్ చేస్తున్నాం.పూర్తి వివరాలు లభించిన తర్వాత తగిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం"అని తెలిపారు.పోలీసులు సైబర్ మరియు ఆర్థిక నేరాల చట్టాల కింద కేసు నమోదు చేసే ప్రక్రియలో ఉన్నారు.ఈ ఘటనతో ఐటీ వర్గాల్లో ఆందోళన నెలకొంది.ఆధ్యాత్మికత పేరుతో నమ్మకాన్ని దోచుకునే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం బాధిత టెక్కీ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుని,తన కుమార్తెల వైద్యచికిత్స కోసం కొనసాగిస్తున్నారు.

## బాబోయ్! రోడ్డు ప్రమాదాలు..

**హైదరాబాద్,నవంబర్06:**నెల్లూరులో ఆటోను గుద్దిన కారు.16 మంది.ఇటీవల దేశంలో ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.క్షణాల్లో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.వీరిపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి.పిల్లల్ని కోల్పోతున్న తల్లిదండ్రులు,తల్లిదండ్రుల్ని కోల్పోయి అనాథలైపోతున్న చిన్నారు.వెరసీ కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చుతున్నారు.ప్రభుత్వాలు,ట్రాఫిక్ పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా.ఎన్ని చర్యలు చేపడుతున్నా ప్రయోజనం ఉండడం లేదు.చేవెళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 24మంది మరణించారు.ఆ ప్రమాద వేదన మరువకముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది.దీంతో ఆటోలో ఉన్న 13మంది మహిళలకు, కారులో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. కొందరు మహిళలు రోడ్డుపైనే తీవ్ర గాయాలతో స్పృహ తప్పి పడిపోయారు. వీరిలో ప్రస్తుతం నలుగురి మహిళల పరిస్థితి విషమంగా ఉంది. వెంటనే వీరిని ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. నెల్లూరు జిల్లాలో లోకేష్ పర్యటన కోసం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తున్నది. కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు బాధితులను పరామర్శించారు.

# చర్చలు ఫలించకపోతే యుద్ధమే.. ఖవాజా ఆసిఫ్



**పాకిస్థాన్,నవంబర్06:**ఉద్రిక్తతలను పరిష్కరించుకునేందుకు గురువారం పాకిస్థాన్‌అఫ్గానిస్థాన్ దేశాల మధ్య కీలకమైన శాంతి చర్చలు ప్రారంభం కానున్నాయి.ఈ నేపథ్యంలో చర్చల ప్రారంభానికి ముందే పాకిస్థాన్ రక్షణ మంత్రిఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేటి చర్చలు ఫలించకపోతే తాలిబన్లతో యుద్ధానికి వెళ్లాల్సి ఉంటుందని వార్నింగ్ఇచ్చారు.శాంతిచర్చలు విఫలమైతే ఇరుదేశాల మధ్యపరిస్థితులు మరింతఉద్రిక్తంగా మారుతాయన్నారు.మావద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయి.శత్రువులు మమ్మల్ని ఎలా టార్గెట్ చేస్తారన్న దాన్ని బట్టి మా ప్రతిస్పందన కూడా తీవ్రస్థాయిలో ఉంటుంది.చర్చలు ఫలించక పోతేయుద్ధం జరిగితీరుతుంది అనిఖవాజా వ్యాఖ్యానించారు.మిలిటెంట్లకుకాబూల్ ఆశ్రయం కల్పిస్తోందని,సీమాంతర దాడులనుప్రోత్సహిస్తోందని పాక్ మంత్రి దుయ్యబట్టారు.అయితే ఖవాజా వ్యాఖ్యలను అఫ్గాన్ తీవ్రంగా ఖండించింది. సామాన్యులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ డ్రోన్ దాడులకు పాల్పడుతోందని మండిపడింది. కాగా టర్కీలోని ఇస్తాంబుల్ వేదికగా అఫ్గాన్‌పాక్ మధ్యనేడు మూడోవిడత శాంతిచర్చలు జరగనున్నాయి. దీనికి ఖతార్,టర్కీ మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. అంతకుముందు దోహా,ఇస్తాంబుల్‌లో రెండు విడతల్లో జరిగిన శాంతి చర్చల్లో ఎలాంటి ఒప్పందాలు జరగలేదు.అఫ్గాన్ భూభాగాన్ని ఉపయోగించుకుంటున్న తెహ్రీక్ ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు.పాక్ ఖైబర్ పఖ్తుంఖ్వాలోని ఒరక్‌జాయ్ జిల్లాలో ఇటీవల దాడులు చేశారు.ఈ దాడుల్లో లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ సహా 11 మంది సైనికులు మరణించారు.ఈ నేపథ్యంలోనే అఫ్గాన్ రాజధాని కాబుల్‌లో పేలుళ్లు చోటుచేసుకున్నాయి.ఈ పేలుళ్లకు పాకిస్థాన్ కారణమని తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ క్రమంలోనే తాలిబన్ సైన్యం పాకిస్థాన్‌పై దాడులకు దిగింది.దాంతో పాకిస్థాన్ ఎదురుదాడులు జరిపింది.ఈ ఘర్షణల్లో ఇరువైపులా భారీ ప్రాణనష్టం జరిగింది. అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

## ముగ్గురు కూతుళ్ల పరిహారం చెక్కు.. ఆ తండ్రికి ఉప్పొంగిన దుఃఖం



**హైదరాబాద్,నవంబర్06:**రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడలో జరిగిన ఘోరరోడ్డు ప్రమాదం అనేకకుటుంబాల్లో విషాదాన్నినిపింది.మంగళ వారం ఉదయం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సును ఒక టిప్పర్‌లారీ వేగంగా ఢీకొట్టింది.ఈఘటనలో 19 మంది మరణించారు,పలువురు తీవ్రంగాగాయపడ్డారు.మృతుల్లో ఎక్కువమంది తాండూరు ప్రాంతానికి చెందినవారని అధికారులు వెల్లడించారు.ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.ఈ ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5లక్షలు, ఆర్టీసీ తరఫున రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.7 లక్షల పరిహారం ప్రకటించారు. ఈ మేరకు నేడు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి బాధిత కుంటుంబాలకు చెక్కులను అందించారు.మృతుల కుటుంబాలకు పరిహారం పంపిణీ కార్యక్రమంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది.చెక్కులను అందుకుంటూ బాధిత కుంటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ ప్రమాదంలో తాండూరు వడ్డెర గల్లీకి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు తనూష,సాయిప్రియ,నందినిమృతి చెందిన విషయంతెలిసిందే. స్థానికంగా కారు డ్రైవర్‌గా పని చేసే ఎల్లయ్య గౌడ్ కుమార్తెలైన వీరు.ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు.కూతుళ్ల దూరమైన బాధతోఆయన విలపించిన తీరుతనూష ఎంబీఏచదువుతోండగా. సాయిప్రియ,నందిని కోఠి ఉమెన్స్‌కాలేజీలో డిగ్రీఫైనల్,ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు.నవంబర్ 2న ఉదయం ట్రైన్ మిస్ కావటంతో తాండూరులో బస్సు ఎక్కి ఊహించని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రాణాలు కోల్పోవటం తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ రోజు పరిహారం చెక్కులను వారి తండ్రి ఎల్లయ్య గౌడ్‌కు ఎమ్మెల్యే అందించారు.ఒక్కొక్కరికి రూ.7 లక్షల చొప్పున మొత్తం రూ.21 లక్షల చెక్కులను ఇవ్వగా.వాటిని చూసిన ఎల్లయ్య గుండెలు పగిలేలా రోధించారు.నా కూతుళ్లు నాకు పంపిన జీతమా ఇది అంటూ ఆయన విలపించిన తీరు అక్కడున్న వారిచే కంటతడి పెట్టించింది.ఎల్లయ్య గౌడ్ ఆవేదన అక్కడున్న వారిని కదిలించింది.కూతుళ్లు దూరమైన బాధతో ఆయన విలపించిన తీరు కన్నీరు పెట్టించింది.ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం ఉపశమనం కలిగించినా.బిడ్డలు లేని లోటు మాత్రం పూడ్చలేనిదంటూ స్థానికులు సైతం కంటతడి పెట్టారు.

# భోజనం ధర తెచ్చిన తంటా.. రైల్లో సిబ్బంది దాష్టీకం



**కరూర్,నవంబర్03:**చిన్న విషయం చిలికి చిలికి గాలివానగా మారుతుంది. అది ఊహించని పరిణామాలకు దారితీయొచ్చు.చికెన్ కూరలో కారం ఎక్కువైందని భార్యపై కోప్పడ్డ భర్త..మనస్తాపంతో ఆ నవవధువు ఆత్మహత్యకు పాల్పడింది. ఇలాంటి వార్తలు నిత్యం మనం చూస్తూనే ఉంటున్నాం.పెళ్లి విందుల్లో ముక్కపడలేదని,గొడవ పడి పెళ్లిళ్లు రద్దయిన సంఘటనలు చాలానే ఉన్నాయి.తాజాగా రైల్లో భోజనం రేటు ఎందుకు అదనంగా ఉందని అడిగినందుగు ప్రయాణికుడిపై క్యాటరింగ్ సిబ్బంది దాడికి పాల్పడ్డారు.ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.రూ.20 అదనంగా ఎందుకు ఉందని ప్రశ్నతో వివాదం ఉత్తరప్రదేశ్లో ఝాన్సీ సమీపంలో అండమాన్ ఎక్స్ ప్రెస్ రైలులో రూ.20 అదనంగా వసూలు చేయడాన్ని ప్రశ్నించినందుకు ఓ ప్రయాణికుడిపై క్యాటరింగ్ సిబ్బంది కర్రలు,బెల్టులతో దాడికి దిగారు.దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.నిహాల్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి కత్రా నుంచి బినాకు అండమాన్ ఎక్స్ ప్రెస్ లో ప్రయాణిస్తున్నారు.ప్రయాణంలో ఆయన రైల్లో వెజ్ మీల్స్ ఆర్డర్ చేశారు. దాని ధర రూ.110 ఉండగా,క్యాటరింగ్ సిబ్బంది ఆయన వద్ద రూ.130 వసూలు చేశారు.దీనిపై నిహాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ధర ఎందుకు ఎక్కువగా తీసుకుంటున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది.దీంతో ఆగ్రహానికి గురైన క్యాటరింగ్ సిబ్బంది, నిహాల్ పై దాడికి తెగబడ్డారు. కొందరు కర్రలు,మరికొందరు బెల్టులతో ఆయనను విచక్షణారహితంగా కొట్టారు. తోటి ప్రయాణీకులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా వవారు లెక్కచేయకుండా దాడిని కొనసాగించారు.ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు రద్దు ప్రారంభం లబ్ధిదారులకు కీలక హెచ్చరిక..




**కరీంనగర్,నవంబర్04:**పేదలకు స్వంత గృహం ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేటాయించిన ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగకపోవడంతో అధికారులు చర్యలకు దిగారు.ఇల్లు మంజూరు అయినా,నిర్ణీత సమయంలో నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల ఇళ్లను ఇప్పుడు ప్రభుత్వం రద్దు చేస్తోంది.తాజాగా కరీంనగర్ జిల్లాలో ఇలాగే నిర్మాణం మొదలుపెట్టని 1017 ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేసినట్లు అధికారికంగా వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు పూర్తి అయ్యేంత వరకు కూడా పనులు ప్రారంభం కానందున ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు.ప్రధానాంశాలు:కరీంనగర్ జిల్లాలో 1017 ఇందిరమ్మ ఇళ్ల రద్దు గడువు లోగా పనులు మొదలుపెట్టని లబ్ధిదారులపై చర్యఖాళీ అయిన ఇళ్ల కొత్త అర్హులైన వారికి మళ్లీ కేటాయించనున్న అధికారులు దశశరతునిర్మాణం ప్రారంభం45 రోజుల్లో తప్పనిసరిగా మొదలుపెట్టాలిపనిలో పురోగతిఫోటోలు అప్‌లోడ్ చేయాలి,అప్పుడు మాత్రమే బిల్లులు విడుదల కానీ అనేక ప్రాంతాల్లో :ప్రభుత్వ సాయం సరిపోదని భావించి పనులు ఆగిపోయాయి బిల్లులు ఆలస్యం అవుతున్నాయని లబ్ధిదారుల ఫిర్యాదులు ఉన్నాయి కొందరు అధికారుల అవినీతి కారణంగా ఇబ్బంది పడ్డారని చెబుతున్నారుదీంతో నిర్మాణం ఆగిపోయిన ఇళ్లు పునాదుల దశలోనే నిలిచిపోయాయి.రద్దయిన ఇళ్ల స్థానంలో ఎమ్మెల్యేలు సూచించిన కొత్త అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు తెలియజేశారు.అంటే ఇల్లు మంజూరు అయిందంటే వెంటనే నిర్మాణం ప్రారంభించాలి. లేకపోతే ఆ అవకాశం ఇంకొకరికి వెళ్తుంది. ప్రభుత్వం పథకాన్ని కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది.నిర్మాణం వాయిదా వేస్తే ఇల్లురద్దు ఖాయం.పేదల కోసంతీసుకువచ్చిన పథకంనిజంగాప్రయోజనకరంగాఉండాలంటే,లబ్ధిదారులు కూడా సక్రమంగా పాల్గొనాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

## ఎన్నికల వేళ బీహార్ ఉపముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు



**బీహార్,నవంబర్06:**బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు నేడు తొలి విడత పోలింగ్ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల వేళ ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హాకు చేదు అనుభవం ఎదురైంది.తన సొంత నియోజకవర్గం లఖిసరైలో ఆయన కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది.ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లను ఉపముఖ్యమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా కొందరు ఆయన కాన్వాయ్‌పై రాళ్లతో దాడి చేశారు.ఈ దాడిపై విజయ్ కుమార్ సిన్హా తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆర్జేడీ నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని.అప్పుడు మేము వారి ఛాతీపై బుల్డోజర్ల తో తొక్కిస్తామని హెచ్చరించారు.ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదా స్పదమవుతున్నాయి.అంతేకాదు తమ ఏజెంట్లను పోలింగ్ బూత్‌ల వద్దబెదిరిస్తున్నారని,బయటకు తోసేస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. ప్రజలను ఓటేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. అయితే,పరిస్థితి అదుపులోనే ఉందని, జిల్లాలో ఓటింగ్ ప్రశాంతంగా జరుగుతోందని పోలీసులు తెలిపారు.పోలింగ్ బూత్‌ల వద్ద బీజేపీ ఏజెంట్లను బెదిరించారంటూ వస్తున్న ఆరోపణలను జిల్లా పోలీసు చీఫ్ అజయ్ కుమార్ తోసిపుచ్చారు. అలాంటిది ఏమీ లేదన్నారు.అలా జరిగి ఉంటే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.జిల్లాలో ఓటింగ్ ప్రశాంతంగా జరుగుతోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.విజయ్ కుమార్ సిన్హా భారతీయ జనతా పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి పార్టీలో వివిధ హోదాలో పని చేసి 2005లో లఖిసరాయ్ శాసనసభ నియోజకవర్గంకు జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై ఆ తరువాత 2005లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయాడు. విజయ్ కుమార్ సిన్హా 2005 నుండి వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికై బీహార్ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా, 25 నవంబర్ 2020 నుండి 24 ఆగస్టు 2022 వరకు బీహార్ శాసనసభ స్పీకర్‌గా పని చేసి అప్పటి సంకీర్ణ ప్రభుత్వమైన మహాఘ్‌బంధన్‌లో అతనిపై అవిశ్వాస తీర్మానం రావడంతో తన పదవికి రాజీనామా చేశాడు.బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి.రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా సాగుతోంది. మొత్తం 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఇవాళ ఓటింగ్ జరుగుతోంది. సుమారు3.75కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల కమిషన్ సమాచారం ప్రకారం ఉదయం 11 గంటల వరకు 27 శాతం ఓటింగ్ నమోదైంది.ఈ దశలో 45,341 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు.వీటిలో చాలా వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి.బీహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఓటువేశారు.

## రోజుకు కొన్ని బాదాలు.. ఆరోగ్యానికి అద్భుత ఫలితాలు!



**హైదరాబాద్,నవంబర్06:** గార్గీశర్మ సూచించినట్లుగా,బాదం మన ఆరోగ్యానికి అద్భుతమైన పోషకాలు అందిస్తుంది.అయితే రాత్రంతా నానబెట్టి తినడం ద్వారా మరింత ప్రయోజనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. రోజూ 58నానబెట్టిన బాదం పప్పులు తింటే జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా ఆకలిని నియంత్రించడంలో,బరువును అదుపులో ఉంచడంలో సహాయపడతాయి.బాదంలోనిఫైబర్,ప్రోటీన్‌లు, హెల్దీఫ్యాట్స్ వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది.మొదటి కొన్ని వారాల్లోనే మంచి మార్పులు గమనించవచ్చు కడుపుఉబ్బరంతగ్గడం,జీర్ణక్రియ సజావుగా సాగడం,శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయి.ఒక నెలతర్వాత చర్మం కాంతివంతంగా మారడం,శక్తిస్థాయిలు పెరగడం వంటి మార్పులు స్పష్టంగా కనిపిస్తాయి.నిపుణుల సూచన ప్రకారం,రోజుకు 5 10బాదంపప్పులకు మించితినకూడదు,ఎందుకంటే వాటిలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. నట్స్ అలర్జీ ఉన్నవారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించి మాత్రమే బాదం తీసుకోవాలి.

## కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటానికి 3 ప్రధాన కారణాలు ఇవే..

కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటం అనేది చాలా మందికి సాధారణంగా కనిపించే,కానీ తీవ్రమైన ఆరోగ్య సమస్య.ఇవి చిన్నవిగా మొదలై,పెద్దవిగా మారి మూత్రనాళాలను అడ్డుకుంటాయి.దీంతో తీవ్రమైన నొప్పి,మూత్రం సమయంలో మంట,మూత్రంలో రక్తం,జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సమయానికి చికిత్స తీసుకోకపోతే కిడ్నీల పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉంది.కిడ్నీల్లో రాళ్లు ఎందుకు వస్తాయి?డాక్టర్ హిమాన్షు వర్మ ప్రకారం,రాళ్లకు మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి:తగినంతనీరు తాగకపోవడం: తక్కువ నీరు తీసుకోవడం వల్ల మూత్రం చిక్కబడుతుంది.దీని వలన ఖనిజాలు సులభంగా పేరుకుపోయి రాళ్లుగా మారతాయి.అధిక ఉప్పు ఆహారం:ఉప్పు ఎక్కువగా తీసుకుంటే సోడియం పెరిగి,శరీరం నుంచి ఎక్కువ కాల్షియం బయటకు వెళ్తుంది.దీని వలన కాల్షియం స్ఫటికాలు ఏర్పడతాయి.ఖనిజాలఅసమతుల్యత: కొంతమంది శరీరాలు సహజంగానే అధిక ఆక్సలేట్ లేదా యూరిక్ యాసిడ్ ఉత్పత్తి చేస్తాయి,ఇవి రాళ్లుగా పేరుకుపోతాయి.ఇతర కారణాల్లో కుటుంబ చరిత్ర, ఊబకాయం, మధుమేహం,అధిక రక్తపోటు,ప్రాసెస్ చేసిన ఆహారం,టీ–కాఫీ,తీపి పదార్థాల అధిక వాడకం కూడా ఉన్నాయి.నివారణ మార్గాలురోజూ 8–9 గ్లాసుల నీరు తప్పనిసరిగాతాగాలి.ఉప్పు,ప్యాకేజ్డ్ ఫుడ్స్ వాడకాన్ని తగ్గించాలి.ఆక్సలేట్ ఉన్న ఆహారం (ఉదా: పాలకూర,చాక్లెట్) మితంగా తినాలి.డాక్టర్ సూచించిన విధంగా కాల్షియం తీసుకోవాలి.మూత్రాన్ని బిగపట్టి ఉంచకూడదు. యూరిక్ యాసిడ్, ఖనిజస్థాయిలను పర్యవేక్షించాలి.

వార్త న్యూస్ యాప్
డౌన్లోడ్ చేసుకోండి



DOWNLOAD

## జాగ్రత సుమా! ఫోన్ చార్జర్ వాడకంపై ప్రభుత్వం సూచనలు



**హైదరాబాద్,నవంబర్06:**మంచి నాణ్యత గల ఛార్జర్ ఉపయోగించడం మీ మొబైల్ ఫోన్ పనితీరును మెరుగుపరచడమే కాకుండా,బ్యాటరీ మరియు పరికరానికి నష్టం వాటిల్లకుండా కాపాడుతుంది.అయితే,నకిలీ లేదా నాణ్యత లేని ఛార్జర్లు వాడటం వల్ల బ్యాటరీ జీవిత కాలం తగ్గడం,అతివేడి పడి పరికరందెబ్బతినడం,ఇంకా కొన్ని సందర్భాల్లో పేలుళ్ల సంభవించడం వంటి ప్రమాదాలు తలెత్తవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో,కేంద్ర ప్రభుత్వం వినియోగదారులను జాగ్రత్తగా ఉండమని సూచించింది. వినియోగదారుల వ్యవహారాల శాఖ తమ అధికారిక జాగో గ్రాహక్ జాగో హ్యాండిల్ ద్వారా ఒక హెచ్చరిక పోస్టు విడుదల చేసింది.అందులో,నాణ్యత లేని ఛార్జర్లు ప్రమాదకరమైనవే.ఎల్లప్పుడూ భద్రతా ప్రమాణాలు కలిగిన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయండి.మీ ఛార్జర్ లేదా పరికరంపై ఉన్న గుర్తు కేవలం గుర్తు కాదు,అది భద్రతా చిహ్నం.దాన్నిఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దు,అని పేర్కొంది.ఈ పోస్టులో ఇంకా,గుర్తు లేని ఛార్జర్లు వాడటం ద్వారా ఫోన్ దెబ్బతినే ప్రమాదం మాత్రమే కాకుండా,వినియోగదారుడి ప్రాణ భద్రతకు కూడా ముప్పు ఏర్పడవచ్చని హితవు పలికింది.కాబట్టి వినియోగదారులు తక్కువ ధరకు లభించే నకిలీ ఛార్జర్లకు ఆకర్షితులు కాకుండా,ప్రామాణిక బ్రాండ్‌లు,సర్టిఫైడ్ ఉత్పతులు మాత్రమే వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ ఎలా గుర్తించాలి?



**హైదరాబాద్,నవంబర్06:**స్త్రీల మాదిరిగానే పురుషులకు కూడా రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.ఇటీవల అమెరికాలోని గ్రౌండ్ జీరో ప్రాంతంలో నివసిస్తున్న పురుషులలో ఈ వ్యాధి కేసులు పెరుగుతున్నట్లు న్యూయార్క్ పోస్ట్ ఒక కథనంలో పేర్కొంది.సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ సమాచారం ప్రకారం,2024లో 91 మంది పురుషుల్లో రొమ్ముక్యాన్సర్ నిర్ధారించబడింది.ఇది 2018లో నమోదైన సంఖ్య కంటే ఆరు రెట్లు ఎక్కువ. పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ చాలా అరుదుగా కనిపించేవ్యాధి అయినప్పటికీ,ఇది పెరుగుతున్న ధోరణిఆందోళన కలిగిస్తోంది.సాధారణంగా ప్రతి లక్షమందిలో ఒకరికిమాత్రమే ఈవ్యాధి వస్తుంది.

## మెట్రో నిర్మాణంపై వివరాలు సమర్పించాలని కోర్టు ఆదేశం



**హైదరాబాద్,నవంబర్06:** పాతబస్తీ మెట్రో నిర్మాణంపై హైకోర్టు దృష్టి పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణానికి సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు గురువారం విచారణ జరిపింది.ఈ సందర్భంగా ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టు పాతబస్తీ ప్రాంత అభివృద్ధికి కీలకమని కోర్టులోతెలిపింది.అయితే, నిర్మాణ పనులకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం,మెట్రో పనులు చారిత్రక కట్టడాలకు సమీపంలో జరుగుతున్నాయని,పురావస్తు శాఖ నుంచి తగిన అనుమతులు పొందలేదని పిటిషనర్ ఆరోపించారు.చారిత్రక స్థలాల వద్ద నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలు ఉన్నాయని ఆయన న్యాయవాది కోర్టుకు వివరించారు.ప్రభుత్వానికి పూర్తి వివరాలు సమర్పించాలంటూ ఆదేశం ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదిస్తూ,ఎంజీబీఎస్ నుండి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రెండో దశ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.పాతబస్తీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడానికే ఈ పిటిషన్ దాఖలు చేశారని ఆయన అన్నారు.ఇరువురి వాదనలు విన్న హైకోర్టు, పాతబస్తీ ప్రాంతంలో జరుగుతున్న మెట్రో నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక వివరాలు,ప్రాజెక్టు మ్యాప్‌తో సహా సమగ్ర నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.అనంతరం తదుపరి విచారణను నవంబర్ 18కు వాయిదా వేసింది.ఇలా చేయడం వల్ల చాలా ప్రమాదాలను ముందుగానే నివారించవచ్చని చెబుతున్నారు. అయితే ఇవి ఇప్పటికే ఏర్పాటు చేయాల్సిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయినప్పటికీ మొత్తమే ఏర్పాటు చేయకపోవడం కన్నా ఆలస్యంగానైనా ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషం అంటూ చెబుతున్నారు.

# వైరల్ అవుతున్న సింగర్ చిన్మయి పోస్ట్



**టాలీవుడ్,నవంబర్05:** సింగర్,డబ్బింగ్ ఆర్టిస్టుగా తెలుగు,తమిళ భాషల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న చిన్మయి శ్రీపాద,గాయకురాలిగా మాత్రమే కాకుండా,సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తన అభిప్రాయాన్ని నిర్భయంగా చెప్పే వ్యక్తిగా కూడా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది.మీటూ ఉద్యమ సమయంలో సినీ పరిశ్రమలో ఉన్న లైంగిక వేధింపులపై స్వర మొదలుపెట్టిన మొదటి మహిళల్లో చిన్మయి ఒకరు.ఆ సమయంలో తమిళ సినిమా ఇండస్ట్రీలో ఉన్న పలువురు ప్రముఖులపై ఆమె చేసిన సంచలన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.రీసెంట్ డేస్ లో ట్విట్టర్ వాడకం మరింత ఎక్కువైంది.సినీ సెలబ్రెటీలు,కొందరు ప్రముఖులు ట్విట్టర్ ను ఎక్కువగా వాడుతూ ఉంటారు.కానీ కొందరు ఆకతాయిలో ఎక్స్ (ట్విట్టర్ )లో బూతులు మాట్లాడుతూ.పిచ్చి పిచ్చి పనులు చేస్తున్నారు.కొందరు ఆడపిల్లల గురించి పిచ్చి వాగుడు వాగుతున్నారు.తాజాగా కొంతమంది అబ్బాయిలు ఓ గ్రూప్ గా క్రియేట్ అయ్యి పచ్చి బూతులు మాట్లాడారు.దీని పై సింగర్ చిన్మయి సీరియస్ అయ్యింది.పోలీస్ డిపార్ట్మెంట్ ను ట్యాగ్ చేసి యాక్షన్ తీసుకోమని చెప్పింది.ట్రోలర్స్ అకౌంట్స్ ను ట్యాగ్ చేస్తూ సరైన యాక్షన్ తీసుకోవాలని కోరింది.గౌరవనీయులైన సజ్జనార్ సర్.దయచేసి దీన్ని గమనించండి.నేను ఈ రోజువారీ వేధింపులతో విసిగిపోయాను. తెలంగాణలో మహిళలు మెరుగైన అర్హత కలిగి ఉన్నారు. వారికి ఏదైనా అభిప్రాయం నచ్చకపోతే వారు విస్మరించి వెళ్లిపోవచ్చు. నేను ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నాను.ఈ కేసు 15 సంవత్సరాలు పట్టినా చట్టం తన పని తాను చేసుకోనివ్వండి.ఈ వ్యక్తులు నా పిల్లలు చనిపోవాలని చెబుతున్నారు. దయచేసి సహాయం చేయండి.అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశారు. చిన్మయి ఫిర్యాదు మేరకు తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఎవరు ట్రోల్ చేశారనే విషయాన్ని తెలుసుకోవడానికి.ట్రోలర్స్ అకౌంట్స్ గురించి ఆరా తీస్తున్నారు. అయితే ఇప్పటికే ట్రోలర్లు తమ అకౌంట్లను డీ యాక్టివేట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

# సినిమాల్లోకి పదేళ్ల తర్వాత..రీఎంట్రీ ఇస్తున్న రోజా



**టాలీవుడ్,నవంబర్06:**ఒకప్పుడు దక్షిణ భారత చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన రోజా,మరోసారి సినీరంగంలోకి రీఎంట్రీ ఇవ్వబోతున్నారని సమాచారం.తెలుగు,తమిళ్ రెండు భాషల్లోనూ సమానంగా సత్తా చాటిన రోజా,90వ దశకంలో టాప్ హీరోయిన్‌గా నిలిచింది.అనేక హిట్ సినిమాలతో తనదైన ముద్ర వేసిన ఈ అందాల నటి, రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత సినీ కెరీర్‌కి గుడ్‌బై చెప్పింది.తరువాత జబర్దస్త్ టీవీ షో ద్వారా ప్రేక్షకులకి దగ్గరగా ఉన్న రోజా,మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ షోను కూడా వదిలేసింది.దీంతో ఆమె ఇక మళ్లీ సినిమాలు చేయరని అందరూ భావించారు. ఇప్పటికే పలు టీవీ షోలలో జడ్జిగా,గెస్ట్‌గా హాజరవుతూ రీఎంట్రీ ఇచ్చిన రోజా ఇప్పుడు సినిమా రంగంలోకి కూడా తిరిగి అడుగుపెట్టబోతోంది.తాజాగా తమిళ సినీ పరిశ్రమలో అగ్ర నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై డీ.డి.బాలచంద్రన్ దర్శకత్వంలో లెనిన్ పాండ్యన్ సినిమా రూపొందుతోంది.ఈ చిత్రంలో రోజా కీలక పాత్రలో నటిస్తోంది. రోజా రీఎంట్రీ సందర్భంగా నటి ఖుష్బూ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు

# రాష్ట్రపతిని కలిసిన మహిళా క్రికెట్ జట్టు



**న్యూఢిల్లీ,నవంబర్ 06:**మహిళల ప్రపంచకప్ లో చరిత్ర సృష్టించిన భారత్ మహిళా క్రికెట్ జట్టు నేడు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ను కలిసింది.తమ అద్భుత ప్రదర్శనతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన ఈజట్టు విజయాన్ని రాష్ట్రపతి అభినందించారు.ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈసమావేశంలోజట్టుసభ్యులు,కోచ్‌లు,సపోర్ట్ స్టాఫ్ పాల్గొన్నారు.రాష్ట్రపతితో ఆటగాళ్లు తమ అనుభవాలను పంచుకున్నారు.టోర్నమెంట్ సమయంలో ఎదురైన సవాళ్లు,ముఖ్యమైన క్షణాలు,విజయానందం గురించి వివరించారు. స్మృతి మంధాన,షెఫాలీ వర్మ, జెమీమారోడ్రిగ్స్ వంటి క్రీడాకారిణిలు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.భవిష్యత్తు తరాలకు రోల్ మోడల్ గా నిలిచారని కొనియాడారు.విభిన్న ప్రాంతాలు, సామాజిక నేపథ్యాలు,ప్రత్యేక పరిస్థితులనుంచివచ్చిన ప్లేయర్లంతా ఇండియాను ప్రతిబింబించారని ముర్ము ప్రశంసించారు.కాగా భారత జట్టునిన్న మోదీని కలిసిన విషయం తెలిసిందే.

# తెలంగాణలో కొత్తగా మూడు టీటీడీ దేవాలయాలు: ఛైర్మన్



**రంగారెడ్డి,నవంబర్04:**తెలంగాణ రాష్ట్రంలో భక్తులకు శుభవార్త. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు,రాష్ట్రంలో కొత్తగా మూడుటీటీడీ దేవాలయాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.టీటీడీ ఆధ్వర్యంలో త్వరలోనే తెలంగాణలోని కరీంనగర్,దుబ్బాక,మంథని ప్రాంతాలలో కొత్త ఆలయాలను నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు. టీటీడీఛైర్మన్‌గా తమపదవీ బాధ్యతలు చేపట్టిఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈవివరాలను తెలిపారు.లడ్డూ నాణ్యత, స్థానికులకు ప్రత్యేక దర్శనం ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడ్డాయని బీఆర్ నాయుడు వెల్లడించారు.ప్రస్తుతం లడ్డూలు 10 రోజుల వరకు తాజాగా, వాసన రహితంగా ఉంటున్నాయని భక్తులు చెబుతున్నారన్నారు.భక్తులకు శుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడానికి,అన్నప్రసాదం తయారీలో అత్యుత్తమ నాణ్యత గల పదార్థాలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. స్థానికులకు మరింత మెరుగ్గా సేవ చేయడానికి, ప్రతి నెల మొదటి మంగళవారం రోజున 3 వేల మంది తిరుపతి స్థానికుల కోసం ప్రత్యేక దర్శనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఏసీబీ విచారణ,టీటీడీ సంస్కరణలుఇప్పటివరకు వ్యక్తుల పేరు మీద ఉన్న కాటేజీలకు ఆ పద్ధతిని నిలిపివేశామని,ఇకపై కాటేజీలకు దేవతామూర్తుల పేర్లు పెడతామని నాయుడు పేర్కొన్నారు.టీటీడీ కొనుగోళ్ల విభాగంలో జరిగిన అవకతవకలపై ఏసీబీ విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు.తప్పు చేసినట్లు తేలితే ఎవరినీ ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీవాణి ట్రస్ట్ రద్దు అవుతుందనే ఊహాగానాలను ఆయన ఖండించారు.తిరుపతి విమానాశ్రయం పేరును శ్రీ వెంకటేశ్వర విమానాశ్రయంగా మార్చడంపై త్వరలో కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.తిరుమల,ఒంటిమిట్ట ప్రాంతాలలో ఔషధ,పవిత్ర వనాలను అభివృద్ధి చేయాలని టీటీడీ యోచిస్తోందని ఆయన వివరించారు.

# అతి అన్ని విషయాల్లో అనర్థదాయకం!



**విజయవాడ,నవంబర్06:** కాశీబుగ్గలో జరిగిన దర్శన తోపులాటలో పలువురు ప్రాణాలు కోల్పోవడం మన అందరి హృదయాలను కలచి వేసింది.ఇది ముమ్మాటికీ మానవ తప్పిదమే అని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మన దేశంలో ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం "క్రమశిక్షణ పాటించకపోవడం.బస్సు ఎక్కాలన్నా, రైలు ఎక్కాలన్నా, చివరికి విమానం ఎక్కే సమయంలో కూడా చివరికి చదువుకున్న వారు కూడా ఒకరిని ఒకరు తోసుకుంటూ విమానం ఎక్కుతున్న పరిస్థితి. ఇక ఇటీవల కాలంలో దేవాలయాల్లో దర్శనాలు సందర్భంగా,నదుల్లో పుణ్య స్నానాలు చేసే సమయంలో అనేక మంది అకాల మరణం చెందడానికి ప్రధాన కారణం క్రమశిక్షణ పాటించకపోవడం. ఆత్రుతతో తోపులాటలు జర గడం వల్ల అనేకమంది భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపో తున్నాయి.ముఖ్యంగా ప్రజలు,యువత,భక్తులు,ప్రయాణి కులు ప్రతీ సందర్భంలోనూ ఓర్పు,సహనం, క్రమశిక్షణ పాటిస్తేనే,ఇటువంటి అకాల మరణాలు నివారించగలం అని గ్రహించాలి. కొంతమేరకు విజ్ఞతతో వ్యవహరించాలి.మూఢ నమ్మకాలు,మూఢ విశ్వాసాల విసర్జించాలి. పూర్వ కాలంలోనూ, అంతగా చదువులేని కాలంలో ప్రజలు సంయమనంతో దర్శనాలు చేసుకునే వారు, సురక్షితంగా ఇంటికి చేరుకునే పరిస్థితి ఉండేది.నేడు అనేక మంది విద్యావంతులు,అనేక విషయాలపై అవగాహన ఉన్నవారు కూడా ప్రమాదాల్లో చిక్కుకోవడం,కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది.దీని అంతటికీ కారణం అత్యుత్సా హం ఆత్రుతతో మాత్రమే.ఇక ప్రభుత్వాలు,వివిధ ఆధ్యాత్మికసంస్థలు, బాబాలు, స్వాములు ఇటీవల కాలంలో ప్రజల్లో మత పర మైన కార్యక్రమాలు ఎక్కువగా చొప్పించడం జరుగుతుంది.ఒక్క మాటలో చెప్పాలంటే "భక్తిని పూర్తిగా వ్యాపారమయం చేయడం జరుగుతుంది.దీనికితోడు సామాజిక మాధ్యమా ల్లో,యూ ట్యూబ్లు,వివిధ ఛానెల్స్ మతపరమైన భావ జాలం విచ్చలవిడిగా ప్రచారం చేస్తూ,ప్రజలను దైవ కార్యక్రమాల్లో మితిమీరి ముంచితేల్చడం జరుగుతుంది.ప్రభుత్వాలు సామాజిక మాధ్యమాలు ప్రజలను, యువతను సమాజంలో విజ్ఞానవంతులుగా, వివేకవంతులుగా, ఉద్యోగ ఉపాధి అవ కాశాలు సాధించే విధంగా, నైపుణ్యాలు నేర్చుకునే విధంగా, అప్పుల ఊబిలో కూరుకుపోకుండా స్వయం సమృద్ధి సాధిం చే విధంగా మన రాష్ట్రాన్ని, దేశాన్ని అతి త్వరలో" వికసిత భారత్‌గా తీర్చిదిద్దే విధంగా దిశానిర్దేశం చేయాలిగాని, మితి మీరిన భక్తిలో మునిగి తేలేటట్లు చివరికి ప్రాణాలు కోల్పో యే విధంగా ప్రోత్సహించడం ఏమాత్రం శ్రేయోష్కరం కాదు.ఇక మనదేశంలో ప్రాచీన కాలం నుండి ప్రాచుర్యం పొందిన అనేక పురాతన దేవాలయాలు ఉన్నాయి. అయితే, ఇటీవల కాలంలో భూస్వాములు, సంపన్నులు, కార్పొరేట్ వర్గాలు, బాబాలు, స్వాములు, ధనికులు "పేర్లు కోసం, రక రకాల కొత్త దేవాలయాలు, ఆశ్రమాలు నిర్మిస్తూ ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, "ప్రైవేటు దేవాలయాలు, ఆశ్రమాల్లు ఎక్కడబడితే అక్కడ నిర్మిస్తున్నారు. ప్రతీరోజూ, ప్రతీఘడియ రకరకాల పండుగలు, పర్వదినాలు అనేక పేర్లతో ప్రజలను మత భావోద్వేగానికి గురయ్యాటట్లు చేస్తున్నారు. ప్రజలు కూడా ఆ ప్రభావంలో పడిపోవడం శోచనీయం. ఇకనైనా ప్రజలు భగవంతుడు అన్ని చోట్లా ఉన్నాడు అని,మనసు మంచిదైతే అంతా మంచి జరుగుతుంది అని ఆలోచన చేయాలి.సెక్యులర్ భావంతో పనిచేయవలసిన ప్రభుత్వాలే మత క్రతువులు ప్రోత్సహించడం,కొన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగాప్రభుత్వాధినేతలే మత క్రతువుల్లో పాల్గొనడం వల్ల, ప్రజలు కూడా ఉద్వేగభరితంగా పాల్గొన్నడం జరుగు తుంది.దీంతో కొన్ని చోట్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది.ప్రజలు ప్రభుత్వాల పనితీరును ప్రశ్నించకుండా ఉండటానికి కూడా ఈమత క్రతువులు ఉప యోగపడుతున్నాయి.



# కె.జి.ఎఫ్ నటుడు కన్నుమూత

**కన్నడ,నవంబర్06:**కన్నడ సినిమాలో గుర్తుండిపోయే ఛాఛా పాత్రలో నటించిన హరీశ్ రాయ్ ఇక లేరు.గత కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ రోజు కన్నుమూశారు. ఆయన మృతి వార్తతో అభిమానులు,సినీ ప్రముఖులు,సహనటులు తీవ్రంగా దుఃఖం వ్యక్తం చేస్తున్నారు.హరీశ్ రాయ్ కొన్నేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్నారు.విడుదలైన తర్వాత ఆయన ఆరోగ్యం క్రమంగా క్షీణించింది.నాల్గో దశలోకి చేరిన వ్యాధి కారణంగా ఆయన పూర్తిగా బలహీనమయ్యారు.వైద్యుల చికిత్స పొందుతున్నప్పటికీ,ఆరోగ్యం మెరుగుపడలేదు.చివరకు ఆయన జీవన పోరాటం ఓడిపోయింది.ఆరోగ్యం క్షీణించడంతో పాటు ఆర్థిక సమస్యలు కూడా ఎదుర్కొన్న హరీశ్ రాయ్‌కి పలువురు సినీ ప్రముఖులు సాయం చేశారు.ముఖ్యంగా నటుడు ధ్రువ్ సర్జా ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించారు.అలాగే పలువురు అభిమానులు సోషల్ మీడియా ద్వారా ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని ప్రార్థనలు చేశారు.కానీ,పరిస్థితి విషమించడంతో చివరికి ఆయన తుదిశ్వాస విడిచారు.రాయ్ తన కెరీర్‌లో పలు సినిమాల్లో నటించినప్పటికీ, ఆయనకు అత్యధిక గుర్తింపు రీబీసీ చాప్టర్ 1 లోని ఛాఛా పాత్రతో వచ్చింది. దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యశ్ హీరోగా వచ్చిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా పెద్ద విజయం సాధించింది. చిన్న పాత్ర అయినప్పటికీ, హరీశ్ రాయ్ తన నటనతో ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు.హరీశ్ రాయ్ మృతి వార్తతో సండల్‌వుడ్ పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది.టీమ్ సభ్యులు,నటుడు యశ్,దర్శకుడు ప్రశాంత్ నీల్, మరియు ఇతర సినీ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా ఆయనకు నివాళి అర్పించారు.ఓ గొప్ప కళాకారుడిని కోల్పోయాం. ఆయన పాత్రలు, వ్యక్తిత్వం ఎప్పటికీ మరిచిపోలేము" అంటూ పలువురు సంతాప సందేశాలు పోస్టు చేశారు.

# వరల్డ్ కప్ విజేతలకు కార్లు గిఫ్ట్ ఇవ్వనున్న టాటా




**న్యూఢిల్లీ,నవంబర్ 06:**మహిళల ప్రపంచకప్ 2025) లో విజేతగా నిలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుకు టాటా మోటార్స్ ఒక అద్భుతమైన శుభవార్తను ప్రకటించింది.దేశం గర్వపడే ఈ విజయానికి గుర్తుగా,కంపెనీ తమ కొత్త కారు టాప్ ఎండ్ మోడల్‌ను జట్టులోని ప్రతి సభ్యురాలికి బహుమతిగా అందజేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.ప్రదర్శన కనబరిచి ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది భారత మహిళా జట్టు ఇటీవల జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ (జూజూది) ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది.ఈ విజయంతో దేశమంతా ఆనందోత్సాహంలో మునిగిపోయింది.క్రీడాకారిణుల పట్టుదల,శ్రమ, ఆత్మవిశ్వాసం,జట్టు స్ఫూర్తి అందరికీ ప్రేరణగా నిలిచాయి.ఇదే సందర్భంలో దేశంలో అగ్రగామి ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.జూది విజేతలు రీఎంట్రీ ఇస్తున్న లెజెండరీ సియెర్రా రెండూ పట్టుదల,ధైర్యం,స్ఫూర్తికి ప్రతీకలని టాటా మోటార్స్ కొనియాడింది.కాగా ఈ కారు నవంబర్ 25న లాంచ్ కానుంది.

# కాంచన 4 రైట్స్ కొనుగోలు రికార్డు!




**టాలీవుడ్,నవంబర్06:**ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా,నోరా ఫతేహీ కీలక పాత్రలో కనిపించనుంది.ఇది నోరా ఫతేహీకి తమిళ సినీ పరిశ్రమలో తొలి చిత్రం కావడం కూడా మరో ప్రత్యేకత.సమాచారం ప్రకారం కాంచన 4 దాదాపు 100కోట్లకు పైగా బడ్జెట్‌తో నిర్మితమవుతోంది.విజువల్స్ ,టెక్నికల్‌స్టాండర్డ్స్ ,హారర్‌ఎఫెక్ట్స్ అన్నీగత భాగాల కంటే చాలా పెద్ద రేంజ్‌లో ఉండనున్నాయి.అదే సమయంలో,సినిమా నిర్మాణం పూర్తికాకముందే ఈ చిత్రానికి సంబంధించిన సాటిలైట్ డిజిటల్ రైట్స్ భారీ మొత్తానికి అమ్ముడయ్యాయి.ఇండస్ట్రీ టాక్ ప్రకారం:డిజిటల్ రైట్స్:60 కోట్లుసాటిలైట్ రైట్స్:50 కోట్లు మొత్తంగా మాట్లాడుతూ,110 కోట్ల నాన్ థియేట్రికల్ బిజినెస్ సినిమా రిలీజ్‌కు ముందే పూర్తైపోయింది.అంటే,సినిమా రిలీజ్ అవ్వకముందే మేకర్స్ సేఫ్ జోన్ లోకి వెళ్లిపోయారు.సినిమా థియేటర్లలో విడుదలైన తర్వాత సుమారు 8 వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేఅవకాశం ఉంది. కథవివరాలురహస్యంగాఉంచినా,ఈసారిహారర్,ఎమోషన్,కామెడీ మిక్స్ మరింత భారీ స్థాయిలో ఉంటుందనే పెద్ద అంచనాలు ప్రేక్షకుల్లో ఉన్నాయి.

# అత్యాధునిక సదుపాయలతో వినికిడి లోపం చిన్నారులకు విద్య

**న్యూఢిల్లీ,నవంబర్ 06:**తిరుమల శ్రీ వెంకటేశ్వరుడి ఆశీస్సులతో తిరుమల తిరుపతి దేవస్థానం వినికిడి లోపం ఉన్న చిన్నారుల కోసం ఒక విశిష్టమైన సేవా కార్యక్రమం శ్రవణం న పారంభించింది.ఈ కార్యక్రమం ద్వారా మాట వినలేని పిల్లలకు మాట్లాడటం, అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు నేర్పించడమే కాకుండా, వారికి ఆత్మవిశ్వాసం పెంచే దిశగా శిక్షణ అందిస్తున్నారు.టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఇటీవల శ్రవణం సంస్థను సందర్శించి,పిల్లలు మరియు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు.శిక్షణా విధానం, అందిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు.పిల్లలకు సమయానికి పాలు,టిఫిన్, భోజనం,తాగునీరు అందుతున్నాయా అనే అంశాలను తెలుసుకున్నారు.అలాగే,శిక్షణ ప్రారంభం తరువాత పిల్లల్లో మాటల ఉచ్చారణ,అర్థం చేసుకునే సామర్థ్యం ఎంత మేర మెరుగుపడిందో కూడా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఈవో ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఆడియో,వీడియో,ఆటలు, పాటల ద్వారా పిల్లలు సులభంగా నేర్చుకునేలా చేయాలి అని తెలిపారు.తరగతి గదుల్లో ఆధునిక వసతులు ఏర్పాటు చేయడం,లైటింగ్,బోధనా పరికరాల కోసం అవసరమైన ఇంజనీరింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయండే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం, శిక్షణ పూర్తయ్యాక ఆధునిక వినికిడి పరికరాల అందజేత, మెరుగైన పాఠ్యాంశాలు, బోధనా సామగ్రి, స్టేషనరీ వంటి అంశాలపై పూర్తి ప్రణాళిక రూపొందించాలన్నారు."శ్రవణం" ప్రాజెక్టుకు టీటీడీ నిధులు కేటాయిస్తోంది. ఈ కార్యక్రమంలో ఏటా అడ్మిషన్లు కొనసాగుతూనే ఉంటాయి. పిల్లల నుంచి ఎటువంటి ఫీజు తీసుకోకుండా ఉచితంగా శిక్షణ ఇస్తారు. ప్రైవేట్ సంస్థల్లో ఇలాంటి కోర్సులకు వేలల్లో లేదా లక్షల్లో చెల్లించాల్సి వస్తే, టీటీడీ మాత్రం దీనిని సేవారూపంగా నిర్వహిస్తోంది.ఇక్కడ స్పీచ్ థెరపీతో పాటు డ్రాయింగ్, సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర విద్యా అంశాలు కూడా బోధిస్తున్నారు. ఈ శిక్షణ ఫలితంగా ఎంతో మంది పిల్లలు మాటలు మాట్లాడటం నేర్చుకుంటున్నారు. వినికిడి లోపం ఉన్న చిన్నారుల జీవితాల్లో వెలుగుని నింపుతున్న ఈ "శ్రవణం" కార్యక్రమం పట్ల ప్రజలు, తల్లిదండ్రులు, వైద్య నిపుణులు ప్రశంసలు కురిపిస్తున్నారు. టీటీడీ చేపట్టిన ఈ సేవా కార్యక్రమం నిజంగా ఒక మానవతా మిషన్గా నిలుస్తోంది.